క్లుప్తంగా

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

జహీరాబాద్ టౌన్: మాజీ ప్రధాని జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే మాణిక్‌రావు నివాళి అర్పించారు. ఆదివారం పస్తాపూర్ వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేశారు. మాజీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తట్టు నారాయణ, నామ రవికిరణ్, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

జహీరాబాద్ టౌన్: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సమైక్య భారతావని కోసం శ్యాంప్రసాద్ తన ప్రాణాలర్పించారని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుధీర్ బండారి, బీజేవైఎం నియోజకవర్గం కన్వీనర్ నరేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

జడ్జి ప్రత్యేక పూజలు



పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో జహీరాబాద్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కవితాదేవి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆలయ అధికారులు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్న సభ్యులు

నారాయణఖేడ్: మనూరు మండలం మాయికోడ్ గ్రామంలో శివశక్తి సభ్యులు రాజ్‌కుమార్ సహకారంతో గడపగడపకూ భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివశక్తి జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ గతను చదవాలని ఆకాంక్షించారు. రాజ్‌పాటిల్, రాజ్‌కుమార్, అఖిల్, నర్సింహ్మా, సాయి పాల్గొన్నారు.

వెలగని వీధిలైట్లు



వీధిలైట్లు వెలగక చీకటిలో కాలనీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో పలు కాలనీల్లో వీధిలైట్లు వెలగక అంధకారం నెలకొంది. ధనలక్ష్మి కాలనీతో పాటు పలు కాలనీల్లో 20 రోజులుగా వీధిలైట్లు వెలగని విషయం పంచాయతీ సిబ్బందికి చెప్పిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. రాత్రి వేళల్లో చీకట్లో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత పంచాయతీ సిబ్బంది స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేసి అంధకారాన్ని తొలగించాల్సిన అవసరం ఉంది.

165 రేషన్ కార్డుల జారీ

రాయికోడ్(అందోల్): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన దరఖాస్తుదారులకు 165 కొత్త రేషన్ కార్డులు మంజూరైనట్లు తహసీల్దార్ ఆశాజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 335 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. ఇప్పటికీ 165 రేషన్ కార్డులు మంజూరు కాగా మిగిలినవి పరిశీలనలో ఉన్నాయన్నారు. పాత రేషన్ కార్డుల్లో 250 మంది పేర్లను కొత్తగా చేర్చినట్లు తెలిపారు.

రహదారిపై సంత.. రాకపోకల చింత

వారాంతపు సంతతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులపై సంత నిర్వహించడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. విశాలమైన మైదాన ప్రాంతానికి తరలించి తమకు ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- ట్రాఫిక్ స్తంభించడంతో కష్టాలు
- విశాలమైన స్థలంలోకి మార్చాలని విజ్ఞప్తి



ఆదర్శనగర్ కాలనీ రహదారిపై ఏర్పాటైన సంత

జహీరాబాద్: పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై నాల్గొవ వారాంతపు సంతను నిర్వహిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలు సాగించడం కష్టంగా ఉందని ఆయాకాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు ట్రాఫిక్‌లో ఇరుక్కుని నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. గతంలో సాయినగర్ కాలనీ రహదారిపై సంతను నిర్వహించేవారు. అక్కడ తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో కాలనీ వాసులు అభ్యంతరం చెప్పారు. దీంతో సంతను పక్క కాలనీకి తాత్కాలికంగా మార్చారు. సంతను క్రమంగా ఆదర్శనగర్ కాలనీకి వెళ్లే రహదారికి మార్చడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. రెండు వారాల నుంచి వ్యాపారులు పెద్ద సంఖ్యలో వచ్చి రహదారిపై సంత ఏర్పాటు చేయడంతో వాహనాలపై ప్రయాణించడం కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వాహనాలతో పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ట్రాఫిక్ స్తంభిస్తుందని కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కొనుగోలుదారులు వాహనాలను రోడ్లపై ఎక్కడికక్కడే నిలుపుతుండడంతో కాలనీలోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆదర్శనగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ పెద్ద విస్తీర్ణంలో ఉండడంతో ప్రజలు అధికంగా నివసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంతను విశాలమైన మైదాన ప్రాంతానికి తరలించి తమకు ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు. సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



రహదారిపైనే నిలిపిన వాహనాలు

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): పేదల ఆరోగ్యానికి వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయమని బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం బొల్లారం శుభకర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడలోని వలస రాష్ట్రాలకు చెందిన పేదల ఆరోగ్యాలకు శుభకర ఆస్పత్రి యజమాన్యం ముందుకు వచ్చి వైద్య శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. శిబిరంలో రోగులకు అధునాతన వైద్య సేవలను అందించడంపై ప్రశంసించారు. వైద్య బృందం రోగులకు ఆర్బీఎస్, బీపీ చెక్ అప్, థైరాయిడ్, టీఎస్ హెచ్, ఈసీజీ వంటి వైద్య సేవలను అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంపత్ రెడ్డి, దీనానాద్, యువజన నాయకులు ప్రవీణ్ రెడ్డి, శుభకర సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.



చంద్రారెడ్డికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఘనంగా ఫలహార బండి ఊరేగింపు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని దుర్గా భవాని బోనాల ఉత్సవాల్లో భాగంగా హట్కర్‌పేటలోని ఆటిపాముల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు ఆదివారం వైభవంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నియోజవర్గ నాయకుడు పట్నం రవితేజ ముఖ్యఅతిథిగా హాజరై ఫలహార బండి ఊరేగింపు ప్రారంభించారు. గ్రామదేవతల అలంకరణ వేషధారణ, డీజే ఆటపాటలు డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు ఆటపాటల మధ్య ఫలహార బండి ఊరేగింపు దుర్గభవాని మందిరం వరకు కొనసాగింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చింత గోపాల్, చింత సాయినాథ్, శ్రీధర్‌రెడ్డి, పీకేఎంయూ సభ్యులు నంద, నానిగౌడ్, నాగరాజు, అవినాష్, మధు, శ్రీవర్ధన్, పవన్ కుమార్, ఆటిపాముల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



ఊరేగింపును ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నేత రవితేజ

భక్తిశ్రద్ధలతో మొహర్రం

సంగారెడ్డి జిల్లాలో ముస్లింలు ఆదివారం మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమాం హుస్సేన్ ప్రాణ త్యాగాన్ని స్మరించుకునే పవిత్ర దినం సందర్భంగా పట్టణంలో మసీదు నుంచి పురవీధుల గుండా శోభాయమానంగా పీర్ల ఊరేగింపు నిర్వహించారు. కుడుకలు, బెల్లం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



వట్‌పల్లి : కన్‌సాన్‌పల్లిలో పీర్ల ఊరేగింపు



జోగిపేటలోని క్లాక్‌టవర్ వద్ద..



సంగారెడ్డిలో భారీ జనసందోహం..



మునిపల్లి(అందోల్): ఖమ్మంపల్లిలో..



మొహర్రం వేడుకల్లో జగ్గారెడ్డి..



హత్నూరలో పెద్ద పీరు సవారీ

త్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడ్కల్ నుంచి ఐదుగురు విద్యార్థులు, కంగ్టి జెడ్పీహెచ్ఎస్ నుంచి ఒక విద్యార్థి బాసర త్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ ఎండీ రహీమోద్దిన్ తెలిపారు. కంగ్టి ఉన్నత పాఠశాల నుంచి కె.భాగ్య (568)మార్కులు , తడ్కల్ పాఠశాలలోని పీ.వైష్ణవి(564), కీర్తన(558), సుహానా(558), పి.సందీప్(553), జే. సందీప్(551) మార్కులు సాధించి త్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంపై స్థానికులు, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల కృషితో మంచి మార్కులు సాధించి ఉన్నత విద్యలో భాగంగా త్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో ఎంఈఓ రహీమోద్దిన్ విద్యార్థులను అభినందించారు.

కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణం

రాయికోడ్(అందోల్): మండలంలోని వివిధ గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ ఎంఎం. షరీఫ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మండలానికి 414 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని అన్నారు. అందులో 35 ఇళ్ల నిర్మాణం బెస్మెంట్ లెవెల్ పూర్తయిందన్నారు. 145 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉందని చెప్పారు.

గుంతల పూడ్చివేత



హైవేపై గుంతలను పూడ్చివేస్తున్న యువకులు

శివ్వంపేట(నర్సాపూర్): తూప్రాన్- నర్సాపూర్ హైవేపై పలుచోట్ల ఏర్పడిన గుంతలను యువకులు ఆదివారం పూడ్చివేశారు. మండల పరిధి గూడూర్ గ్రామానికి చెందిన యువకులు స్వచ్ఛందంగా కంకర, సిమెంట్, డస్ట్ సమకూర్చుకుని చాకరిమెట్ల నుంచి శివ్వంపేట వరకు హైవేపై పలుచోట్ల ఏర్పడిన గుంతలను పూడ్చారు. హైవేపై ఏర్పడిన గుంతలను సంబంధిత శాఖ నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు నివారించేందుకు తమవంతు కృషి చేసినట్లు గూడూర్ గ్రామ యువకులు ప్రవీణ్, విజయ్, సందీప్, మింటు, నరేష్, లక్ష్మణ్, సంతోష్ అన్నారు.

జంతువులకు టీకాలు తప్పనిసరి

పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్

పటాన్‌చెరు టౌన్: పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జూనోసిస్ డే ను పురస్కరించుకొని పటాన్‌చెరు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూనోసిస్ అనగా జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధి అని తెలిపారు. మూగజీవాల పెంపకంలో పోషకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. 97 పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది మల్లేశం, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని పశు వైద్యశాలలో ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రాబిస్ టీకాల వేశారు. కార్పొరేటర్ పుష్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ జెనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ప్రభుత్వం ఉచిత యాంటీ రాబిస్ టీకాలను ఇస్తుందని తెలిపారు. వైద్య సలహాల మేరకు సకాలంలో పెంపుడు జంతువులకు టీకాలు ఇప్పించాలని కోరారు. రాబిస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డా.వంశీకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

పదిగంటల పనివిధానంపై ధర్నా

సదాశివపేట(సంగారెడ్డి): పదిగంటల పని విధానం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓను వెనక్కి తీసుకుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అంబేడ్కర్ విగ్రహం చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. అనంతరం అమలు జీఓ కాపీలను దహనం చేశారు. సీఐటీయూ సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని విధానానికి బదులు 10 గంటల పనివిధానం అమలుకు జీఓ జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే జీఓ ప్రభుత్వంవెనక్కి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అనిల్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పనివేళల పెంపుపై సీఐటీయూ ఆగ్రహం



జీవో కాపీలను దగ్ధం చేస్తున్న మహిపాల్ తదితరులు

జహీరాబాద్ టౌన్: పని వేళలు 10 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో కాపీలను ఆదివారం సీఐటీయూ నాయకులు దగ్ధం చేశారు. సీఐటీయూ జిల్లాకార్యదర్శి మహిపాల్ ఆధ్వర్యంలో శ్రామిక్ భవనం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీవో కాపీలను దగ్ధం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ...రోజుకి 8 గంటల పనిదినాలు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం 10 గంటలకు పెంచిందన్నారు. కనీస వేతనాలు లేక కష్టాలు పడుతున్న కార్మికులతో వెట్టి చాకిరీ చేయించడానికి పనిగంటలను పెంచిందని ఆరోపించారు. కార్మికులకు వ్యతిరేకమైన ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని, లేనట్లయితే కార్మికుల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కనకారెడ్డి, సందీప్‌రెడ్డి, వంశీ, నరేశ్, మోహన్, రవిలు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక టేకూర్

- మొహర్రం వేడుకల్లో జిల్లాలోనే ప్రథమం
- నేటి నుంచి రెండు రోజుల పాటు ఉత్సవాలు
- భారీగా తరలిరానున్న ప్రజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మొహర్రం పండగ వచ్చిందంటే ఆ గ్రామంలో సందడి నెలకొంటుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు సమీప కర్నాటక నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తారు. జిల్లాలోనే మొహర్రం వేడుకలకు టేకూర్ గ్రామం ప్రసిద్ధి. గ్రామంలో జరిగే పండుగకు దశాబ్దాల చరిత్ర ఉంది. మొహర్రం పండుగ ముగిసిన రోజు నుంచే రెండు రోజుల పాటు ఇక్కడ పెద్ద ఎత్తున ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గ్రామం పక్కనే ఉన్న కొండ గుట్టపై మహిమాన్వితమైన దర్గా ఉంది. ఆ దర్గాను దర్శించుకునేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి దూది పీర్లతో ప్రజలు వేల సంఖ్యలో తరలివస్తారు. కుల,మతాలతో సంబంధం లేకుండా అన్నీ వర్గాల వారు ఉత్సవాల్లో పాల్గొంటారు. గ్రామం నడిబొడ్డున ప్రజలు పాటలు పాడుతూ రెండు రోజుల పాటు రుమాళ్ల ఆటతో పాటు ఇతర ఆటలు ఆడుతారు. రుమాళ్ల ఆట ప్రతి ఒక్కరి ఆకట్టుకుంటుంది. వివిధ ప్రాంతాల నుంచి పీర్లతో వచ్చిన ప్రజలు గుట్టపై దర్గాకు వెళ్లి దర్శనం చేసుకుంటారు.

మహిమ గల దర్గా

టేకూర్ గ్రామం సమీపంలో గుట్టపై ఉన్న గుహలో వందల ఏళ్ల క్రితం వెలసిన మైబుసుభాని దర్గా మహిమ వల్లే ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున దూది పీర్లు వస్తాయని కథనం. దర్గాలో గల మైబుసుభానిని దర్శించుకుంటే ఏరోగాలు రావని ప్రజల నమ్మకం. కాలినడకన గుట్టపైకి ఎక్కడానికి ప్రజలు ఇబ్బందులు పడుతుంటారు. దర్గా మహిమ వల్ల దూది పీర్లతో వచ్చేవారు మాత్రం గుట్టపైకి పరిగెత్తుకుంటూ సునాయాసంగా వెళ్లడం అందరిని ఆశ్చర్యపరుస్తుంది.



టేకూర్ గుట్ట గుహలోని మైబుసుభాని

నబీసాబ్ సమాధి

గుట్టపై మైబుసుభాని దర్గాను దర్శించుకునేందుకు వెళ్తున్న క్రమంలో కింది భాగంలో నబీసాబ్ సమాధి ఉంటుంది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు సమాధిని దర్శించుంటారు. గతంలో నబీసాబ్ జీవించి ఉన్నప్పుడు పలు మహిమలు చూపేవాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అప్పట్లో పీర్లకు శక్తిని నింపేవాడని అందుకే పీర్లు ఇక్కడకు వస్తాయని వారు తెలిపారు. రెండు రోజులపాటు జరిగే మొహర్రం ఉత్సవాలకు గ్రామస్తులు, యువజన సంఘం సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధాన కూడలి వద్ద గల ఆషుర్‌ఖానాను అందంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచే ఇక్కడకు వచ్చే ప్రజలకు గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. మొహర్రం ఉత్సవాల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జహీరాబాద్ డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కిటకిటలాడిన ఆలయాలు

తొలి ఏకాదశిని పురస్కరించుకొని జిల్లాలోని ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాల వద్ద బారులు తీరి పూజలు చేసి దర్శనం చేసుకున్నారు. సామూహిక భగవద్గీత, విష్ణు సమస్ర నామ పారాయణం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేవారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆలయాల వద్ద తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.



సంగారెడ్డి టౌన్ : వైకుంఠపురం ఆలయంలో..



కంగ్టిలో సంప్రదాయ భజనలు



జహీరాబాద్:పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు



జిన్నారం : వేంకటేశ్వరస్వామి ఆలయంలో..